క్లుప్తంగా

నిబంధనలు పాటించాలి



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంవీఐ వెంకట పుల్లయ్య

బూర్గంపాడు: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని భద్రాచలం మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ సంగం వెంకట పుల్లయ్య అన్నారు. జాతీయ భద్రతా మాసోత్సవాలలో భాగంగా బూర్గంపాడు ప్రధాన కూడలిలో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనదారులు ధ్రువపత్రాలు కలిగి ఉండాలన్నారు. హెల్మెట్ ధరించాలని సూచించారు. ట్రాక్టర్, ఆటో, లారీ డ్రైవర్లు, ద్విచక్ర వాహనాదారులు పాల్గొన్నారు.

చర్ల అదనపు ఎస్సైగా కేశవ్

చర్ల: చర్ల అదనపు ఎస్సైగా కేశవ్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. దుమ్ముగూడెంలో పని చేస్తున్న కేశవ్‌ను ఉన్నతాదికారులు చర్లకు బదిలీ చేయడంతో వారి ఆదేశాల మేరకు ఆయన విదుల్లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉన్నతాధికారుల ఆదేశాలతో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా సీఐ రాజువర్మను ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు.

జీఓ 64ను ఉపసంహరించాలి

దమ్మపేట: ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తున్న దినసరి వేతన కార్మికుల, వేతనాలు తగ్గించే జీఓ నంబరు 64ను వెంటనే ఉపసంహరించాలని, సీఐటీయూ జిల్లా నాయకుడు పిట్టల అర్జున్ డిమాండ్ చేశారు. జీఓ ఉపసంహరణపై ఈ నెల 24న నిర్వహించనున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయంతం చేయాలని కోరుతూ.. బుధవారం మండల పరిధిలోని పెద్దగొల్లగూడెం ఆశ్రమ పాఠశాలలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పిట్టల అర్జున్ మాట్లాడుతూ.. ఆశ్రమ పాఠశాల కార్మికులకు గతంలో మాదిరిగా వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అప్పారావు, రామలక్ష్మి, గోవిందమ్మ, రత్తమ్మ, పద్మ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

దమ్మపేట: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మండలంలోని గుర్వాయిగూడెం గ్రామానికి చెందిన కుంజా పోతురాజు(38) అను వ్యక్తి మంగళవారం రాత్రి, దమ్మపేటలో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా.. బైక్ ఢీ కొట్టిన ఘటనలో పోతురాజు కాలికి తీవ్ర గాయమైన సంఘటన పాఠకులకు విదితమే. క్షతగాత్రుడిని ఖమ్మం ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా, బుధవారం మృతిచెందాడు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సాయి కిషోర్ రెడ్డి తెలిపారు.

ఒలంపియాడ్‌లో ప్రతిభ

మణుగూరురూరల్: గత ఏడాది డిసెంబర్ నెలలో జరిగిన ఒలంపియాడ్ టెస్ట్ (నాలెడ్జ్ అసెస్మెంట్ టెస్ట్)లో మండలంలోని గుట్టమల్లారంలో ఉన్న శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చి 38కిపైగా బంగారు పతకాలు, మెరిట్ సర్టిఫికెట్లు, నగదు ప్రోత్సాహకాలు సాధించి విజయకేతనం ఎగురవేశారు. ఒలంపియాడ్ టెస్ట్‌లో సత్తా చాటిన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపల్ యుగంధర్ బుధవారం పాఠశాల ఆవరణలో ప్రత్యేకంగా అభినందించారు. ముమ్ముందుకు కూడా అత్యుత్తమ ప్రతిభ కనబరుస్తూ పాఠశాలకు మంచిపేరు తేవాలని ప్రిన్సిపల్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అకాడమిక్ డీన్ భాస్కర్‌రెడ్డి, సీ బ్యాచ్ ఇన్‌చార్జ్ కొమరయ్య, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థుల విరాళం

మణుగూరురూరల్: మున్సిపాలిటీలోని పైలట్ కాలనీలో ఉన్న ఎక్స్‌లెంట్ హైస్కూల్ విద్యార్థులు విరాళాలుగా సేకరించిన రూ.31వేల చెక్కును సోచ్ ఆర్గనైజేషన్–హైదరాబాద్ వారికి ఎక్స్‌లెంట్ విద్యాసంస్థల కరస్పాండెంట్ ఎండి.ఖాదర్ బుధవారం సాయంగా అందజేశారు. అనంతరం విరాళాల సేకరణలో కృషి చేసిన పలువురు విద్యార్థులకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు అందించి ప్రత్యేకంగా అభినందించారు. ఎక్స్‌లెంట్ విద్యాసంస్థల చైర్మన్ యూసఫ్ షరీఫ్, డైరెక్టర్ యాకుబ్ షరీఫ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శీతల శవపేటిక వితరణ

అశ్వాపురం: మండల కేంద్రానికి చెందిన భారజల కర్మాగారం ఉద్యోగి కొర్లకుంట విజయపరమేశ్వరరావు దంపతులు మండల కేంద్రంలో గౌతమీనగర్ కాలనీ వాసుల సౌకర్యార్థం భారజల కర్మాగారం గౌతమీనగర్ కాలనీ రెసిడెన్స్ వెల్ఫేర్ సొసైటీ వారికి బుధవారం శీతల శవపేటిక వితరణగా అందజేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ కార్యదర్శి అజయ్‌కుమార్, స్పోర్ట్స్ సెక్రటరీ కందుల శ్రీనివాసరావు, ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, సూపర్‌వైజర్ స్టాఫ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రమేష్, ఉద్యోగులు పాల్గొన్నారు.

అదే తీరు.. అదే హోరు

- రెండోరోజూ రసాభాసగా గ్రామ సభలు
- జాబితాల్లో అర్హులకు మొండిచేయి.. అనర్హులకు స్థానం కల్పించారని ఆగ్రహం
- స్థానికులను సముదాయించిన అధికార యంత్రాంగం



అన్నపురెడ్డిపల్లి : మర్రిగూడెం సభలో కింద కూర్చుని ఆందోళన చేస్తున్న ప్రజలు



ములకలపల్లి: మాధారం ప్రధాన సెంటర్‌లో రాస్తారోకో చేస్తున్న సీపీఎం నాయకులు

ములకలపల్లి: మండలపరిధిలోని మాధారం జీపీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన గ్రామ సభ రసాభాసగా సాగింది. అనర్హులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించారని, ఆత్మీయ భరోసా, రైతు భరోసా పథకంలోనూ స్థానికులకు చోటు దక్కలేదని స్థానికులు అధికారులతో వాగ్వివాదం చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో పాల్వంచ–మండలపల్లి ప్రధాన రహదారిపై గంటపైగా రాస్తారోకో చేశారు. దీంతో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. నూతన కమిటీని నియమిస్తామని అదనపు కలెక్టర్ వేణుగోపాల్ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. మండల ప్రత్యేకాధికారి రమేశ్, ఎంపీడీఓ రేవతి, డీటీ భాగ్యలక్ష్మి, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు అన్నవరపు సత్యనారాయణ, మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు, మండల కమిటీ సభ్యుడు ఊకంటి రవికుమార్, శనగాని వినోద్, కురం ప్రభాకర్, సిద్దిని రమణ తదితరులు పాల్గొన్నారు.

దమ్మపేట: మండల పరిధిలోని ఆఖినేపల్లి, మారప్పగూడెం, మల్కారం, గండుగులపల్లి, లింగాలపల్లి, జగ్గారం, తొట్టిపంపు, పార్కలగండి, ముష్టిబండ గ్రామాల్లో గ్రామ సభలను నిర్వహించారు. లింగాలపల్లి, జమేదారుబంజర గ్రామాల పరిధిలో పలువురికి పట్టాలు రాలేదని స్థానిక గిరిజనులు ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యను దరఖాస్తు రూపంలో అందజేయమని డిప్యూటీ తహసీల్దార్ కోరడంతో.. స్థానికులు అలానే చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ భీమిరెడ్డి రవీంద్ర రెడ్డి, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

పినపాక: మండలంలో బుధవారం పాత రెడ్డిపాలెం, ఉప్పాక, పి.కొత్తగూడెం, మల్లారం, దుగ్నేపల్లి, పాండురంగాపురం, గ్రామాల్లో రెండో రోజు గ్రామ సభలు నిర్వహించారు. పాత రెడ్డిపాలెం గ్రామ సభలో ఎంపీడీఓ వెంకటేశ్వరరావుతోపాటు సీఐ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాలను గ్రామసభలో వివరించారు. అభ్యంతరాలు ఉంటే తమకు తెలియజేయాలని, అర్హులైన లబ్ధిదారులు ఇంకా ఎవరైనా ఉంటే వారు గ్రామసభలో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ వెంకటేశ్వరరావు సూచించారు.

చంద్రుగొండ/అన్నపురెడ్డిపల్లి: చంద్రుగొండ, అన్నపురెడ్డిపల్లి మండలాల్లో రెండోరోజు బుధవారం జరిగిన గ్రామసభల్లో అర్హులైనప్పటికీ తమ పేర్లు జాబితాలో ఎందుకు లేవని ప్రజలు అధికారులను నిలదీశారు. అన్నపురెడ్డిపల్లి మండలంలోని మర్రిగూడెంలో బీఆర్ఎస్ నాయకులు పెద్దారపు నాగరాజు ఆధ్వర్యంలో ఆందోళనకారులు వేదిక ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. రెండో జాబితాలో అర్హులను ఎంపిక చేస్తామని ఎంపీడీఓ మహాలక్ష్మి హామీ ఇవ్వడంతో వారు శాంతించారు. గుంపెనలో జనం మధ్యే పెద్ద ఎత్తున గొడవ జరిగింది. ఇక్కడ పంచాయతీ సెక్రటరీ శాంతి చేసిన తప్పిదాలపై కట్టుగూడెం గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజాపురం సభలో డీఎస్పీ అబ్దుల్ రెహమాన్, ఎస్ఐ చంద్రశేఖర్ పాల్గొన్నారు. చంద్రుగొండ మండలంలోని తుంగారంలో సీఐ ఇంద్రసేనరెడ్డి, ఎస్ఐ శివరామకృష్ణ ప్రజలను సర్దిచెప్పి శాంతింపజేశారు. వెంకటియాతండాలో గిరిజనులు సభలో హోరెత్తించారు. అన్నపురెడ్డిపల్లి మండలంలో సభలను అడిషనల్ డీఆర్‌డీఓ రవి పరిశీలించారు.

అశ్వాపురం: మండల పరిధిలోని కల్యాణపురం, నెల్లిపాక, అమెర్ద, అమ్మగారిపల్లి, చింతిర్యాల కాలనీ, ఆనందాపురం, వెంకటాపురం, మల్లెలమడుగు గ్రామ పంచాయతీలలో బుధవారం ప్రజాపాలన గ్రామ సభలు నిర్వహించారు. కల్యాణపురం గ్రామ సభలో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. గ్రామసభల్లో అధికారులు అర్హుల జాబితా చదివి వినిపించగా.. అర్హులమైనా జాబితాల్లో మా పేర్లు లేవని స్థానికులు అధికారులను ప్రశ్నించారు. నిరుపేదలమైనా పథకాలకు పేర్లు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దరఖాస్తుల స్వీకరణ నిరంతర ప్రక్రియ అని అధికారులు ప్రజలకు సూచించారు.

అశ్వారావుపేటరూరల్: మండలంలోని ఊట్లపల్లి, ఆసుపాక, నందిపాడు, రామన్నగూడెం, అనంతారం, మల్లాయిగూడెం, నారంవారిగూడెం, పాత రెడ్డిగూడెం గ్రామ పంచాయతీల్లో బుధవారం ప్రజాపాలన గ్రామసభలు నిర్వహించారు. వీటిలో ఊట్లపల్లి, ఆసుపాక, నందిపాడు జీపీల్లో జరిగిన గ్రామసభలు రసాభాసగా జరిగాయి. ఆయా పంచాయతీల్లో ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల జాబితాలో అర్హులైన వారి పేర్లు రాలేదని, అర్హత లేని వారి పేర్లు ప్రకటించడంతో లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేశారు. పోలీసులు వారిని శాంతింపజేశారు. అర్హత లేని వారి పేర్లు తొలగిస్తామని అధికారులు చెప్పడంతో వివాదం సద్దుమనిగింది. గ్రామసభల్లో తహసీల్దార్ వనం కృష్ణ ప్రసాద్, ఎంపీడీఓ ప్రవీన్ కుమార్, ఏఓ శివరాం ప్రసాద్, ఎంపీవో సోయం ప్రసాద్, కార్యదర్శులు పాల్గొన్నారు.

కరకగూడెం: నూతన పథకాలకు లబ్ధిదారుల ఎంపిక గ్రామ సభలు బుధవారం మండలంలోని రేగళ్ల, పద్మాపురం, చిరుమళ్ల, రఘునాథపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో అధికారులు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు ముసాయిదా జాబితాను చదివి వినిపించారు. అలాగే అర్హులా జాబితాలో పేర్లు రానివారు అధికారులకు వినతి పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మణుగూరుటౌన్: సభలో లిస్ట్‌లో వచ్చిన పేర్లు చదువుతున్న క్రమంలో కూనవరం గ్రామసభ బుధవారం రసాభాసగా మారింది. లిస్ట్‌లో తమ పేర్లు రాలేదని, ఇందిరమ్మ ఇల్లు, రేషన్‌కార్డులు ఆత్మీయ భరోసాను తమకు వర్తింపజేయాలంటూ ఒక్కసారిగా గ్రామస్తులు ప్రశ్నించగా, ప్రజలను అధికారులు ఎంపీఓ వెంకటేశ్వరరావు నచ్చజెప్పి శాంతింపజేసి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు ఏఈ సత్యనారాయణ, డీటీ కృష్ణ, ఏఈఓ లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



కరకగూడెం: చిరుమళ్ల గ్రామసభ..



అశ్వారావుపేటరూరల్: ఊట్లపల్లిలో అధికారులను నిలదీస్తున్న మహిళలు

నవ్వులు పూయించిన బుడ్డోడు



గ్రామసభ మైక్‌లో పాటలు పాడుతున్న పిల్లవాడు

పినపాక: మండలపరిధిలోని పాతరెడ్డిపాలెం గ్రామ సభ వాడీవేడిగా జరుగుతుండగా గ్రామంలోని ఓ పిల్లవాడు కాసేపు నవ్వులు పూయించాడు. అధికారులు గ్రామసభ నిర్వహించి మధ్యలో లబ్ధిదారుల నుంచి దరఖాస్తుల స్వీకరిస్తున్న సమయంలో ఆ పిల్లవాడు స్టేజ్ దగ్గరికి వెళ్లి ఎంపీఓ చేతిలోని మైక్ తీసుకున్నాడు. మైక్‌లో ఏబీసీడీలు చదువుతూ, పాటలు పాడడం మొదలెట్టాడు. దీంతో అందరూ గ్రామసభను మర్చిపోయి కాసేపు సరదాగా నవ్వుకున్నారు.



చంద్రుగొండ: తుంగారం సభలో ప్రజలకు నచ్చజెబుతున్న సీఐ ఇంద్రసేనరెడ్డి



అశ్వాపురం: అమెర్దలో అధికారులను ప్రశ్నిస్తున్న మహిళలు



దమ్మపేట: జమేదార్‌బంజర గ్రామసభలో డీటీకి వినతిపత్రం అందజేస్తున్న గిరిజనులు

ప్రతీ పేద కుటుంబానికి మేలు



బూర్గంపాడు: ఇరవెండి గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



దుమ్ముగూడెం: కొత్తపల్లి గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ వెంకట్రావు



ములకలపల్లి: చౌటీగూడెం జీపీ గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

బూర్గంపాడు: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 26 నుంచి అమలు చేయనున్న నాలుగు పథకాలతో ప్రతి పేద కుటుంబానికీ మేలు జరుగుతుందని పినపాక శాసనసభ్యుడు పాయం వెంకటేశ్వర్లు అన్నారు. ఇరవెండి గ్రామపంచాయతీలో బుధవారం జరిగిన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇళ్లు లేనటువంటి నిరుపేదలకు పినపాక నియోజకవర్గంలో 3500 ఇళ్లు తొలివిడతగా మంజూరు చేస్తున్నామన్నారు. ఇందిరమ్మ ఇళ్లు నిరంతర ప్రక్రియ అని ఎవరు ఆందోళన చెందవద్దన్నారు. కార్యక్రమంలో మండల అధికారులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మణుగూరుటౌన్: అర్హులందరికీ పథకాలు లభిస్తాయని గ్రామసభల్లో పేర్లు చదివిన తర్వాత అభ్యంతరాలు వ్యక్తం చేసి పేర్లు రాని వారు దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం తొగ్గూడెం పంచాయతీలోని గ్రామసభలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా అధికారులు లిస్ట్‌లోని పేర్లు చదివి గ్రామస్తులకు వినిపించి అభ్యంతరాలు స్వీకరించారు. అదేవిధంగా రెండో రోజు గ్రామసభలో కట్టుమల్లారం, కూనవరం, పగిడేరు, తిర్లాపురం గ్రామాలతో పాటు పట్టణంలోని శేషగిరినగర్‌తో పాటు మున్సిపల్ కార్యాలయం, హనుమాన్ ఆలయ సమీపం తదితర ఏరియాలలో గ్రామసభలు నిర్వహించారు.

పారదర్శకంగా ఎంపిక చేయాలి

దుమ్ముగూడెం: రైతుభరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డుల మంజూరులో లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు సూచించారు. బుధవారం మండలంలో జరిగిన గ్రామ సభలలో భాగంగా కొత్తపల్లి, నారాయణరావుపేట గ్రామ సభల్లో భద్రాచలం ఆర్డీఓ దామోదర్‌రావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. కొత్తపల్లి గ్రామసభలో మాట్లాడుతూ.. గ్రామస్తుల సలహాలు సూచనలు మేరకు నిజమైన అర్హులకు నష్టం లేకుండా లబ్ధిదారులను ఎంపిక చేయాలని సూచించారు. ఆర్డీఓ మాట్లాడుతూ.. నిజమైన లబ్ధిదారుల ఎంపిక కోసమే ప్రభుత్వం గ్రామసభలను నిర్వహిస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందుతాయని అన్నారు. గ్రామసభల్లో ప్రత్యేకాధికారులు హరిలాల్, రాజులు, తహసీల్దార్ అశోక్‌కుమార్, ఏఓ నవీన్‌కుమార్, ఎంపీఓ రామకృష్ణ, సీఐ అశోక్, మార్కెట్ కమిటీ చైర్మన్ తెల్లం సీతమ్మ, ఏపీఓ సుకన్య, ఆర్‌ఐలు కల్లూరి వెంకటేశ్వర్లు, నరసింహారావు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అర్హులకే స్థానం..

ములకలపల్లి: ప్రభుత్వ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక అత్యంత పాదర్శకంగా సాగుతోందని, అర్హులైన ప్రతీ ఒక్కరికీ న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. మండలపరిధిలోని కమలాపురం, రామచంద్రాపురం, మాధారం, పొగళ్లపల్లి జీపీ కేంద్రాల్లో బుధవారం ఏర్పాటు చేసిన గ్రామసభల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎటువంటి అపోహలకు తావులేకుండా, నిరుపేదలకు ఖచ్చితంగా పథకాలు అందిస్తామని స్పష్టం చేశారు. అనంతరం ములకలపల్లి డీసీసీబీ, తెలంగాణా గ్రామీణ బ్యాంక్‌ల సందర్శించారు. అర్హత ఉండీ ఋణమాఫీ కాని రైతుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం..

కమలాపురం, రామచంద్రాపురం జీపీలో ఏర్పాటు చేసిన గ్రామసభను ఎమ్మెల్యే ఆదినారాయణ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పలువురు మండల అధికారులు సభకు సకాలంలో హాజరు కాకపోవడంతో ఎమ్మెల్యే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామసభల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే సహించేదిలేదని స్పష్టం చేశారు. వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌కు ఎమ్మెల్యే ఫోన్లో ఫిర్యాదు చేశారు. ఈ గ్రామ సభల్లో తహసీల్దార్ గుడ్ల పుల్లారావు, ఎంపీడీఓ రేవతి, ఎంపీఓ లక్ష్మయ్య, ఏఓ అరుణ్‌బాబు, ఆర్ఐ భద్రు.కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు, మాజీ సర్పంచ్ కారం సుధీర్, గాడి తిరుపతిరెడ్డి, మడకం చిరుమప్ప. పాలకుర్తి సుమిత్, సురభి రాజేశ్ తదితరులున్నారు.

బాధితులకు ఆర్థిక సాయం

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణ శివారులో ఉండే రామారావు అనే వ్యక్తికి చెందిన పూరి ఇల్లు ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో కాలిపోయింది. కాగా ఈ విషయాన్ని తెలుసుకున్న స్థానిక చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యదర్శి కంభంపాటి సురేష్ కుమార్ తన తోటి వ్యాపారస్తులతో కలిసి రామారావు కుటుంబానికి ఆర్థిక సాయం చేసేందుకు కృషి చేశారు. దీనిలో భాగంగా తోటి వ్యాపారుల సహకారంతో రూ.20 వేలు పోగు చేసి బుధవారం భద్రాచలం అసిస్టెంట్ ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ చేతుల మీదగా బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో ముర్ల రమేష్, సహాయ ఫౌండేషన్ నిర్వాహకులు బిర్రు సుధాకర్, ప్రణయ్, తదితరులు పాల్గొన్నారు.



నగదును అందజేస్తున్న భద్రాచలం అసిస్టెంట్ ఎస్పీ విక్రాంత్, దాతలు

‘ఉపాధి హామీ’తో ముడిపెట్టొద్దు..



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు అన్నవరపు కనకయ్య

మణుగూరుటౌన్: మున్సిపాలిటీ పరిధిలో పలు గ్రామాల్లో అత్యధిక జనాభా ఉపాధి లేక అవస్థలు ఎదుర్కొంటున్నారని, అలాంటి వారికి ఉపాధి హామీ కార్డు ఉంటేనే 12వేలు ఇస్తామని చెప్పడం సరికాదని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు అన్నవరపు కనకయ్య అన్నారు. బుధవారం స్థానిక శ్రామిక భవన్‌లో సీపీఎం మండల కమిటీ సమావేశం ఉప్పతల నర్సింహారావు అధ్యక్షతన జరగ్గా ఆయన పాల్గొని మాట్లాడారు. మున్సిపాలిటీ పరిధిలో ఉన్న గ్రామాలను పంచాయతీలుగా చేసి మణుగూరు మెజర్ గ్రామ పంచాయతీ చేయాలని ప్రభుత్వానికి ఎన్నోసార్లు తెలిపామన్నారు.

మున్సిపాలిటీలోని ఉన్న గ్రామాలకు ఎటువంటి షరతులు లేకుండా 12వేలు స్కీం అమలు చేయాలని ఇందిరమ్మ ఇల్లు, రేషన్‌కార్డులు, ఇతర పథకాల పట్ల ప్రజలు గందరగోళాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి సత్రపల్లి సాంబశివరావు, జిల్లా కమిటీ సభ్యులు నిమ్మల వెంకన్న, నాయకులు నెల్లూరు నాగేశ్వరరావు, కొడిశాల రాములు, పార్టీ మండల కమిటీ సభ్యులు ములకల ఉత్తం, అల్లే సుధాకర్, గౌరి, దొడ్డి నిర్మల, టేకుల సత్యవతి, సీహెచ్ నరసయ్య, సున్నం మల్లేశ్, సుదర్శన్ తదితరులు ఉన్నారు.

శ్రీదేవి ఆశయ సాధనకు కృషి

భద్రాచలంఅర్బన్: సీపీఎంను బలోపేతం చేయడమే బండారు శ్రీదేవి ఆశయ సాధన అని, అదే ఆమెకిచ్చే ఘన నివాళి అని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ఏజే.రమేష్ అన్నారు. అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) సీనియర్ నాయకురాలు, పార్టీ సభ్యురాలు బండారు శ్రీదేవి 6వ వర్ధంతి సభ పార్టీ పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు, ఐద్వా పట్టణ కార్యదర్శి డి.సీతాలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఏజే రమేష్ మాట్లాడుతూ.. పార్టీలోనూ, మహిళా సంఘంలోనూ ఆమె క్రియాశీలకంగా పని చేశారని అన్నారు. ముందుగా బండారు శ్రీదేవి చిత్రపటానికి పార్టీ నాయకులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నర్సారెడ్డి, పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, జిల్లా కమిటీ సభ్యులు బండారు శరత్ బాబు, పార్టీ పట్టణ కమిటీ సభ్యులు నాగరాజు, కోరాడ శ్రీనివాస్, భూపేంద్ర, కుంజ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



బండారు శ్రీదేవి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

నిబంధనలకు పాతర!

- ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, హోటళ్లలో నాణ్యతకు తిలోదకాలు
- ఒకే నూనెలో పలు రకాల వంటకాలు
- చోద్యం చూస్తున్న అధికారులు

ఈ మధ్య కాలంలో ఇంటి ఆహారం కంటే పిల్లల నుంచి పెద్దల వరకు బయట ఆహారాన్నే ఎక్కువగా ఇష్టపడుతున్నారు. వండుకునే ఓపిక, సమయం లేకపోవడమో.. మరే ఇతర కారణంగానో రెడీ టు ఫుడ్‌కు బాగా అలవాటు పడిపోయారు. దీన్ని ఆసరాగా చేసుకుని వ్యాపారస్తులు సొమ్ము చేసుకుంటున్నారు. ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, హోటళ్లలో ఆహారంలో నాణ్యతను పాటించడం లేదు.



ఓ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ వద్ద పలుమార్లు వాడిన నూనెలో పునుగులు ఉడికిస్తున్న దృశ్యం



పదేపదే వాడడంతో నలుపు రంగులోకి మారిన నూనె

భద్రాచలంఅర్బన్: హోటళ్లలో త్వరగా లభించే ఆహార పదార్థాలకు అలవాటు పడిన ప్రజలు వాటి నాణ్యతను పరిశీలించడం లేదు. సమోస, గారెలు, బజ్జీలు, వడలు వీటితో పాటు వేడిగా లభించే చికెన్, వెజ్ మంచూరియా, చేపలఫ్రై, చికెన్ కబాబ్, చికెన్ పకోడి, ఫ్రాన్స్ ఫ్రైలను తినేందుకు భద్రాచలంలో ఉన్న ప్రజలు ఎంతో ఆసక్తి చూపుతున్నారు. వీటిని తయారుల చేసే కొందరు వ్యాపారులు ఆదాయమే ప్రధాన లక్ష్యంగా నాణ్యతను విస్మరిస్తున్నారు. రోజుల తరబడి కళాయిలో వంట నూనెను మార్చకుండా వివిధ రకాల ఆహార పదార్థాలు తయారు చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. భద్రాచలంలో నిత్యం రద్దీగా ఉండే పలు ప్రధాన సెంటర్లలో ఈ పరిస్థితి స్పష్టంగా కనిపిస్తోంది. ఇలా పదే పదే మరిగించిన నూనెతో తయారు చేసిన పదార్థాల వల్ల గుండెలో చెడు కొలెస్ట్రాల్ పెరిగి ఇబ్బందులు వస్తాయి. కేన్సర్‌కు బారినపడే ప్రమాదం ఉంది. మామూళ్లకు అలవాటు పడిన సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవడంలో పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారని వినికిడి.

అపరిశుభ్రతకు చిరునామా..

భద్రాచలం పట్టణంలో ఒకటి, రెండు హోటళ్లు మినహా ఇతర వాటిల్లో శుభ్రత పాటించటం లేదు. మాంసాహార హోటళ్లలో పరిస్థితి మరీ అధ్వానంగా ఉంది. మిగిలిపోయిన మాంసాన్ని ఫ్రిడ్జ్‌లో ఉంచి.. తర్వాత రోజు వినియోగిస్తున్నారు. ఫాస్టుఫుడ్ సెంటర్లలోనూ ఇదే పరిస్థితి. భద్రాచలం పట్టణంలో దాదాపు 50కి పైగానే ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు వెలిశాయి. వీటిల్లో విక్రయిస్తున్న ఆహార పదార్థాల్లో ఈగ, క్రిమికీటకాలు పడినా దిక్కులేదు. పాడైపోయిన చికెన్, మటన్ వ్యర్థాలను వినియోగిస్తున్నారని కూడా తెలుస్తోంది. ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

జాగ్రత్తలు పాటించాలి



కల్తీ ఆహారం తీసుకోవడంతో ఆరోగ్య సమస్యలు ఉత్పన్నమవుతాయి. కాలేయ, గుండె సంబంధిత వ్యాధులు, హైపర్ టెన్షన్, కొవ్వు పెరగడం, స్థూలకాయం, క్యాన్సర్ల బారినపడే ప్రమాదం ఉంది. కొన్ని హోటళ్లలో పదార్థాలు ఎక్కువ సార్లు ఫ్రై చేస్తుంటారు. వాటిని తినడం ఆరోగ్యానికే హానికరం. తగిన జాగ్రత్తలను ప్రతి ఒక్కరూ పాటించాల్సిన అవసరం ఉంది.

– డాక్టర్ చైతన్య, డిప్యూటీ డీఎంహెచ్ఓ, భద్రాచలం

నిబంధనలు పాటించకుంటే సీజ్..



ప్రభుత్వ నిబంధనలు విరుద్ధంగా ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, హోటళ్లు, రెస్టారెంట్లు నిర్వహిస్తే వాటిని వెంటనే సీజ్ చేస్తాం. నూనెను మళ్లీమళ్లీ వాడకూడదు. మాంసాహారాలు నిల్వ ఉంచొద్దు. అనారోగ్యానికి గురయ్యే విధంగా నిర్వహిస్తున్న హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల వివరాలను 912163567లో తెలియజేయాలి.

– కిరణ్ కుమార్, జిల్లా ఆహార కల్తీ నిరోధకశాఖ అధికారి